క్లుప్తంగా

గోశాలలో స్వచ్ఛ భారత్



గోవులను నీటితో శుభ్రం చేస్తున్న ఆలయ అధికారులు, సిబ్బంది

రాయచోటి టౌన్ : రాయచోటి శ్రీ భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి ఆలయానికి చెందిన గోశాలలో స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ ఈఓ డీవీ రమణారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం రాయచోటి రూరల్ పరిధిలోని దిగువ అబ్బవరం గ్రామంలో ఉన్న గోశాలలో గోవులతోపాటు సముదాయంలోని అన్ని గదులు, ఇతర ప్రాంతాలను శుభ్రపరిచారు. ఈ కార్యక్రమం ఆలయ సిబ్బంది, ఆలయ ప్రధాన అర్చకులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలందుకున్న నల్లగంగమ్మ



భక్తులకు దర్శనమిస్తున్న నల్లగంగమ్మ

సంబేపల్లె : మండల కేంద్రంలోని శ్రీ దేవర రాయి నల్లగంగమ్మ ఆలయంలో ఆదివారం శ్రావణమాస పూజలను పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయాన్ని వేపాకులతో ఆలయ ప్రాంగణమంతా శుద్ధి చేశారు. అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చకులు, అభిషేకాలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకొని బీజాక్షారాలు ఉన్న మహిమగల రాయిపై పొర్లుదండాలు పెట్టారు.

మల్లూరమ్మ దర్శనానికి పోటెత్తిన భక్తులు



మల్లూరమ్మకు పూజలు చేయిస్తున్న భక్తులు

చిన్నమండెం : మండల పరిధిలోని మల్లూరు గ్రామంలో కొలువైన శ్రీ మల్లూరమ్మ ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఆదివారం కావడంతో అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు గావించారు. మొక్కులు తీరిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని బోనాలు సమర్పించారు. బంధుమిత్రులతో కలిసి విందును ఆరగించారు. వచ్చిన భక్తులకు ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలను అందజేశారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థి ఎంపిక



అభిషేక్

గాలివీడు : డిస్కస్ త్రోలో రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు గౌతమ్ స్కూలు విద్యార్థి అభిషేక్ ఎంపికైనట్లు స్కూల్ యాజమాన్యం సైజు థామస్, షింటో ఇమ్మానుయేల్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్జీఎఫ్ఐ ఉమ్మడి కడప జిల్లా స్థాయిలో శనివారం జరిగిన అండర్–17 విభాగంలో తమ పాఠశాల విద్యార్థి అభిషేక్ అత్యుత్తమ ప్రదర్శన కనబరచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికవ్వడం హర్షదాయకం అన్నారు. అనంతరం రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికైన అభిషేక్‌ను వారు అభినందించారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

వీరబల్లి : మండలంలోని ఓదివీడు పంచాయతీ కస్పాలో ఆదివారం అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు ఎస్ఐ తన సిబ్బందితో వెళ్లి ఆ ఇసుక ట్రాక్టర్‌ను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

వివాదాస్పద స్థలం పరిశీలన



స్థల వివాదంపై గ్రామస్తులతో మాట్లాడుతున్న రాయచోటి రూరల్ సీఐ వరప్రసాద్

వీరబల్లి : మండలంలోని సోమవరం పంచాయతీ, కమ్మపల్లిలో వివాదాస్పద స్థలాన్ని ఆదివారం రూరల్ సీఐ వరప్రసాద్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామస్తులతో మాట్లాడుతూ స్థల వివాదాన్ని స్థానిక తహసీల్దార్‌తో మాట్లాడి సమస్యను పరిష్కరించుకోవాలని, ఘర్షణలు పడరాదని సూచించారు. గత కొన్ని సంవత్సరాలుగా ఈ వివాదం ఇలాగే కొనసాగుతుందని, దీనిపై రెవెన్యూ అధికారులు రికార్డులు పరిశీలించి లబ్ధిదారులకు న్యాయం చేయాలని రెవెన్యూ సిబ్బందిని సీఐ కోరారు. ఘర్షణలకు దిగితే కఠినంగా వ్యవహరిస్తామన్నారు.

శరన్నవరాత్రులకు ముస్తాబవుతున్న అమ్మవారిశాల

- ముమ్మరంగా సాగుతున్న ఉత్సవ అలంకరణ పనులు
- అక్టోబర్ 3వ తేదీ నుంచి వైభవంగా ప్రారంభంకానున్న దసరా ఉత్సవాలు



గర్భగుడిలో కొలువైన శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరీదేవి మూలవిరాట్



రాజంపేటలోని అతిపురాతనమైన అమ్మవారిశాల

రాజంపేట టౌన్ : ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో ప్రొద్దుటూరు తరువాత రాజంపేటలో దసరా ఉత్సవాలను అత్యంత ఘనంగా నిర్వహిస్తారు. రాజంపేట పట్టణం నడిబొడ్డున వెలసిన శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరీదేవి ఆలయంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో జరిగే దసరా ఉత్సవాలు ఏడాదికేడాది అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది కూడా దసరా ఉత్సవాలను భారీగా నిర్వహించేందుకు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఉత్సవాలు జరిగే పదిరోజులపాటు నిత్యం వేలాది మంది భక్తులు అమ్మవారిశాలకు తరలి వచ్చి ప్రత్యేక అలంకరణలో కొలుదీరే అమ్మవారిని దర్శించుకుంటారు. అందువల్ల భక్తులకు కనువిందు చేసేలా ఈ ఏడాది అమ్మవారిశాల పరిసర ప్రాంతాల్లోనే కాక పట్టంలోని వివిధ ప్రాంతాల్లో అమ్మవారి ప్రతిమలను విద్యుత్‌దీపాలతో ఏర్పాటు చేస్తున్నారు. అమ్మవారిశాలలోకి ప్రవేశించే మార్గాల్లో భారీ సెట్టింగ్‌లతో అలంకరణలు చేస్తున్నారు.

ఉత్సవాలకు 134 ఏళ్ల చరిత్ర

రాజంపేటలోని అమ్మవారిశాలను 1890వ సంవత్సరంలో నిర్మించారు. అప్పటి నుంచి దసరా ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆర్యవైశ్యులు చెబుతున్నారు. ఇక్కడి దసరా ఉత్సవాలకు 134 సంవత్సరాల చరిత్ర ఉండటం విశేషం. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా అమ్మవారిశాలలోని గర్భగుడి రథం ఆకారంలో ఉండటం ఇక్కడి ప్రత్యేకతగా చెప్పవచ్చు. రథం ఆకారంలో ఉన్న గర్భగుడిలో శ్రీవాసవీ మాత మూలవిరాట్ భక్తులకు దేదీప్యమానంగా దర్శనమిస్తుంది.

3 నుంచి ప్రారంభం

అక్టోబర్ మూడవ తేదీ నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభంకానున్నాయి. అందులో భాగంగా తొలిరోజు శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి దీక్షా బంధనదేవి అలంకారంలో దర్శనమివ్వనున్నారు. అలాగే 4వ తేదీ బిల్వవృక్ష నివాసిని అలంకారంలో, 5వ తేదీ అన్నపూర్ణాదేవి అలంకారంలో, 6వ తేదీ కృష్ణమూర్తి అలంకారంలో, 7వ తేదీ మోహినిదేవి అలంకారంలో, 8వ తేదీ మీనాక్షిదేవి అలంకారంలో, 9వ తేదీ సరస్వతీదేవి అలకారంలో, 10వ తేదీ మహిషాసుర మర్దినిదేవి అలంకారంలో, 11వ తేదీ మహాలక్ష్మీదేవి అలంకారంలో, 12వ తేదీ రాజరాజేశ్వరీదేవి అలంకారంలో, 13వ తేదీ ఊంజలిదేవి అలంకారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు.

9న బిందెసేవ గ్రామోత్సవం

శరన్నవరాత్రి ఉత్సవాల్లో బిందెసేవ గ్రామోత్సవానికి ఎంతో విశిష్టత ఉంది. బిందెసేవను ఆర్యవైశ్యులు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తారు. అలాగే ప్రతి ఇంటి నుంచి ఒకరైనా ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. బిందెసేవ గ్రామోత్సవంలో వివిధ ప్రాంతాలకు చెందిన కళాకారుల ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకుంటాయి. ఈ ప్రదర్శనలను తిలకించేందుకు పట్టణ ప్రజలే కాక వివిధ గ్రామాల ప్రజలు ప్రతి ఏడాది పెద్దఎత్తున పాల్గొంటుండటం విశేషం.

నిత్యం సాంస్కృతిక కార్యక్రమాలు

దసరా అంటేనే సందడైన పండుగ. అందువల్ల దసరా ఉత్సవాలను పురస్కరించుకొని ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు ప్రతి రోజు రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నారు. అందులో భాగంగా టీవీ, సినీ కళాకారులతో తప్రదర్శనలను ఏర్పాటు చేశారు. అలాగే ప్రజలను ఉత్రూతలూగించే వివిధ సాంస్కృతిక ప్రదర్శనలను ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నారు.



అమ్మవారిశాల వీధిలో ఉత్సవాలకు చేస్తున్న ఏర్పాట్లు

టపాసుల గోడౌన్‌లు తనిఖీ



గోడౌన్ రికార్డులను పరిశీలిస్తున్న సీఐ

వీరబల్లి : మండల కేంద్రంలో ఉన్న మూడు టపాసుల గోడౌన్‌లను ఆదివారం రూరల్ సీఐ వరప్రసాద్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గోడౌన్ల యజమానులతో మాట్లాడుతూ సూచనల మేరకే స్టాక్‌ను ఉంచుకోవాలని సూచించారు. స్టాక్‌కు సంబంధించిన లైసెన్సులను, రికార్డులను పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో స్థానిక ఎస్ఐ మోహన్ నాయక్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

చింతకొమ్మదిన్నె : మండలంలోని గంగమ్మతల్లి ఆలయంలో ఆదివారం అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలతోపాటు అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారిని పట్టు వస్త్రాలతో అలంకరించారు. భక్తులు అమ్మవారికి ముడుపులను చెల్లించుకున్నారు. ఆలయానికి వచ్చిన బంధుమిత్రులతో విందు భోజనాలు చేశారు. ఆలయ ఆవరణలోని ఆలయాలలో పూజలు నిర్వహించారు.

పేదలకు న్యూరో వైద్య సేవలందించడమే లక్ష్యం



వైద్య సేవలు అందిస్తున్న న్యూరో వైద్యులు

సుండుపల్లె : గ్రామాల్లోని పేద ప్రజలకు న్యూరో వైద్య సేవలు అందించడమే తమ లక్ష్యమని, 200 మందికి చికిత్సలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు వైద్యులు వినూత్న, వెంకట ప్రసాద్ రెడ్డిలు తెలిపారు. మండల కేంద్రంలోని వశిష్ట ఉన్నత పాఠశాలలో కరస్పాండెంట్ పెద్ద రెడ్డయ్య రాజు ఆధ్వర్యంలో న్యూరో సైన్స్ వైద్యసేవలందించే ఎంఆర్‌పల్లిలో ఉన్న వినూత్న హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో ఉచిత మెగా న్యూరో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 200 మందికి ఉచిత చికిత్సలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండలంలోని వాయిలపాటి వాండ్లపల్లెకు చెందిన డాక్టర్ వెంకట ప్రసాద్ రెడ్డి, డాక్టర్ వినూత్నలు మాట్లాడుతూ తమ స్వగ్రామంలోని నిరుపేదలకు వైద్య సేవలు అందించేందుకు ఉచితంగా వైద్య శిబిరం ఏర్పాటు చేశామన్నారు. గ్రామాలలోని నిరుపేదలకు న్యూరోకు సంబంధించిన వ్యాధుల పట్ల అవగాహన ఉండదని, వారికి వైద్య సేవలు అందించడం కోసం తాము వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి రవీంద్ర నాయక్, ఎస్టీయూ నాయకుడు రవీంద్రారెడ్డి, వినోద్‌కుమార్ రెడ్డి, వినూత్న హాస్పిటల్ వైద్య సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట ధర్నాను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న సీఐటీయూ నేత ఎ.రామాంజులు

రాయచోటి అర్బన్ : కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను వెంటనే రెగ్యులర్ చేయాలన్న డిమాండ్‌తో సోమవారం కలెక్టరేట్ ఎదుట నిర్వహింప తలపెట్టిన ధర్నాను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్ చంద్రశేఖర్, ఎ.రామాంజులు, కోశాధికారి హరిశర్మలు పిలుపునిచ్చారు. ఆదివారం సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రతి ఎన్నికల ముందు కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని హామీలిచ్చి అధికారంలోకి వచ్చే పాలకులు తర్వాత ఖజానా ఖాళీ అంటూ ద్రోహం చేస్తున్నారని మండిపడ్డారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సుప్రీంకోర్టు చెబుతుంటే ఏ ఒక్కరూ ఆచరించకపోవడం దారుణమన్నారు. భద్రతలేని ఉద్యోగాలు, కార్మిక, ఉద్యోగ చట్టాల రక్షణకై జిల్లా కలెక్టరేట్ ఎదుట చేపడుతున్న ధర్నాకు అందరూ హాజరై విజయవంతం చేయాలంటూ వారు విజ్ఞప్తి చేశారు.

పుల్లంపేట వాసికి కడప సేవా రత్న అవార్డు



అవార్డు అందుకుంటున్న సుబ్బనరసారెడ్డి

పుల్లంపేట : సామాజిక సేవలు అందిస్తూ ఆదర్శంగా నిలుస్తున్న పుల్లంపేట విభిన్న ప్రతిభావంతుల సమైఖ్య సేవా సంఘం అధ్యక్షుడు సుబ్బనరసారెడ్డికి కడప సేవా రత్న అవార్డు వరించింది. ఆదివారం కడపలోని వైఎస్సార్ ప్రెస్ క్లబ్‌లో శ్రీవెంకటలక్ష్మీ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయనకు అవార్డు ప్రదానం, సత్కర కార్యక్రమం ఏర్పాటు చేశారు. అనంతరం మల్లు సుబ్బనరసారెడ్డి సేవా కార్యక్రమాలకు సహకరించిన దాతలకు, సంఘం సభ్యులకు, సమాజసేవకులకు తమ సంఘం తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

దసరా ఉత్సవాల ఆహ్వాన పత్రికలు విడుదల



ఆహ్వాన పత్రికను విడుదల చేస్తున్న ఆర్యవైశ్య సంఘం సభ్యులు

నందలూరు : మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామంలో వెలసిన శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు సందర్భంగా ఆదివారం దసరా ఆహ్వాన పత్రికలను ఆర్యవైశ్య సంఘం సభ్యులు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆలయ అధ్యక్షులు ఎంబలూరు నరసింహ స్వామి మాట్లాడుతూ 3వ తేదీ దీక్ష బంధన అలంకారం, 4న పార్వతీదేవి అలంకారం, 5న గజలక్ష్మీ దేవి అలంకారం, 6న కృష్ణమూర్తి అలంకారం, 7న మోహినీ అలంకారం, 8న మీనాక్షి దేవి అలంకారం, 9న సరస్వతీ దేవి అలంకారం, 10న మహిషాసుర మర్దిని దేవి అలంకారం, 11న అన్నపూర్ణదేవి అలంకారం, 12న సెమీ దర్శనం, గ్రామోత్సవం, రాత్రి రాజరాజేశ్వరీ దేవి అలంకారం, 13న వసంతోత్సవం, రాత్రి ఊంజల సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు.

కాంట్రాక్టర్‌ది నిర్లక్ష్యం.. అధికారులది అలసత్వం

- అర్ధాంతరంగా ఆగిపోయిన ఓవర్ హెడ్ ట్యాంకు పనులు
- కల్యాణంలోపు పూర్తి కాకుంటే ఇక్కట్లేనంటున్న భక్తజనం



ఆగిన ఓవర్ హెడ్ ట్యాంక్ పనులు

ఒంటిమిట్ట : ఏకశిలా నగరి ఒంటిమిట్ట సీతారాముల కల్యాణ వేదిక ప్రాంగణంలో సీతారాముల కల్యాణానికి లక్షల్లో భక్తులు పాల్గొంటారు. కల్యాణానికి విచ్చేసిన భక్తులకు తాగునీటికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు టీటీడీ అధికారులు ఓవర్ హెడ్ ట్యాంకు టెండర్లు పిలవగా గుత్తేదారుడు (కాంట్రాక్టర్) టెండర్ వేసి దక్కించుకొని పనులు ప్రారంభించారు. సకాలంలో పూర్తి చేయాల్సిన కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో పనులు అసంపూర్తిగా మిగిలిపోయాయి. ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన కాంట్రాక్టర్‌ను టీటీడీ అధికారులు బ్లాక్ లిస్టులో పెట్టారు. అనంతరం కాంట్రాక్టర్ సంబంధిత అధికారులను కలిసి పనులు పూర్తి చేస్తానంటూ తెలియజేసి తిరిగి పనులు ప్రారంభించి అర్ధాంతరంగా ఆపేశారు. భక్తులకు అసౌకర్యాలు కలుగకుండా ఉండేందుకు చర్యలు తీసుకుంటున్న అధికారులు ఆ పనులను పూర్తి చేయడంలో నిర్లక్ష్యంగా ఉంటున్నారన్న విమర్శ మండలంలో వినిపిస్తోంది. ఇదే విధంగా పనులు జరిగితే కల్యాణ వేడుక సమయానికి ఓవర్ హెడ్ ట్యాంకు పనులు పూర్తికావని, నీటికి కూడా ఇబ్బంది పడాల్సిన పరిస్థితి ఉంటుందంటూ భక్తులు ఆవేదన చెందుతున్నారు. ఒంటిమిట్ట కోదండరాముని బ్రహ్మోత్సవాలు దృష్ట్యా వచ్చే ఉత్సవాల నాటికైనా ట్యాంకు పనులు పూర్తి చేసేలా అధికారుల చొరవచూపాలంటూ భక్తులు ఆశగా ఎదురు చూస్తున్నారు. మరి టీటీడీ అధికారులు ట్యాంక్ నిర్మాణ పనులపై ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.

గుత్తేదారుడుపై చర్యలు తీసుకుంటాం

కల్యాణ వేదిక వద్ద ఓవర్ హెడ్ ట్యాంక్ పనులు గుత్తేదారుడి నిర్లక్ష్యం వల్లే అసంపూర్తిగా నిలిచిపోయాయి. దీనిపై పలుమార్లు గుత్తేదారుడికి నోటీసులు ఇచ్చినా తీరు మార్చుకోలేదు. అతనిపై చర్యలు తీసుకొని టెండర్ రద్దు చేసి కొత్త వారికి టెండర్ అప్పగించాల్సిందిగా ఉన్నతాధికారులకు ప్రపోజల్ పంపించాం.

– టీటీడీ డిప్యూటీ ఈఈ నాగరాజు

కొల్లం బ్రహ్మానందరెడ్డికి ఘన నివాళి



బ్రహ్మానందరెడ్డి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు కొల్లం బ్రహ్మానందరెడ్డి ఐదవ వర్ధంతిని ఆదివారం వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రతి ఒక్కరికీ ఏదో విధంగా తానున్నానంటూ సహాయం చేసి పార్టీ కార్యకర్తలకు, నాయకులకు అండగా ఉండేవారని ఈ సందర్భంగా ఆయన్ను స్మరించుకున్నారు.

2న శాంతి ర్యాలీ

కడప కల్చరల్: వీహెచ్‌పీ ఆధ్వర్యంలో అక్టోబర్ 2న నగరంలో ఆధ్యాత్మిక నిరసన, శాంతి ర్యాలీ నిర్వహించనున్నామని బెస్తవేముల రామ మహేష్, మనోహర్ రెడ్డి తెలిపారు. శాంతి నిరసనలో భాగంగా కడపలో అక్టోబరు 2 ఉదయం 9గంటలకు స్థానిక ఎన్జీఓ కాలనీలోని వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద ర్యాలీ ప్రారంభమవుతుందన్నారు.

ఏఐకెఎం మండల కమిటీ ఏర్పాటు



సమావేశంలో మాట్లాడుతున్న విశ్వనాథ

రాయచోటి అర్బన్ : సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ అనుబంధ ఆల్ ఇండియా కిసాన్ మహాసభ రాయచోటి మండల నూతన కమిటీ ఆదివారం ఏకగ్రీవంగా ఎంపికైంది. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఏఐకెఎం మండల స్థాయి ముఖ్యకార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లానేత మావులూరి విశ్వనాథ మాట్లాడుతూ ఏఐకెఎం నేతలు రైతాంగ సమస్యల పరిష్కారం కోసం అనునిత్యం పోరాటం చేయాలన్నారు. అనంతరం సమావేశంలో ఏఐకెఎం మండల కన్వీనర్‌గా పూసపాటి రమణ, సభ్యులుగా మామిళ్ల పెద్దినాయుడు, శ్రీనివాసులు, రమణతోపాటు మరో 7మంది సభ్యులుగా ఎన్నుకున్నారు. సమావేశంలో లిబరేషన్ పార్టీ నాయకురాళ్లు సుజాత, సుబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు.

వర్షం కోసం పశుపతినాథుడికి అభిషేకాలు



పశుపతినాథుడికి జలాభిషేకం చేస్తున్న భక్తులు

సంబేపల్లె : అభిషేక ప్రియుడు, ప్రమదగణాలకు అధిపతి అయిన పరమేశ్వరుని సంబేపల్లె శ్రీ గృహేశ్వరీ పశుపతినాథాలయంలో పురప్రజలు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శివలింగస్వరూపునికి రుద్రభిషేకం, బిళ్వార్చన, పంచామృతాభిషేకం తదితర పూజా క్రతులవలన పురోహితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం 108 బిందెలతో శివలింగానికి జలాభిషకం చేశారు. వర్షాలు కురిసి దేశమంతా సుభిక్షంగా వుండాలని భక్తులు ఈశ్వరునికి ప్రణమిల్లారు. కార్యక్రమంలో భక్తులు భరత్‌రాజు, నరేంద్రరాజు, రామక్రిష్టారెడ్డి, సుధీర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గంగజాతర

పీలేరు రూరల్ : మండలంలోని బాలంవారిపల్లె పంచాయతీ మొరవపల్లెలో గంగజాతర ఘనంగా నిర్వహించారు. శనివారం రాత్రి గ్రామంలోని నడివీధి గంగమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం అమ్మవారికి దీలు, బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించారు. మహిళలతో 101 బిందెతో అమ్మవారికి జలాభిషేకం నిర్వహించారు. సంవృద్ధి వర్షాలు కురిసి పాడిపంటలు వృద్ధి చెందాలని పూజలు చేశారు.

మొక్కలు నాటిన బీజేపీ నాయకులు



రైల్వేకోడూరు అర్బన్ : కోడూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో బీజేపీ నాయకులు మొక్కలు నాటారు. ప్రధాని నరేంద్ర మోడీ పుట్టినరోజు వేడుకలు సందర్భంగా ఆదివారం ఈ కార్యక్రమం చేపట్టినట్టు వారు పేర్కొన్నారు.

ఎద్దు పొడవడంతో రైతుకు గాయాలు

పెద్దతిప్పసముద్రం : మండలంలోని కాట్నగల్లుకు చెందిన చింతపల్లి ఉత్తన్న (55) అనే రైతు ఎప్పటి లాగానే తన ఎద్దులను ఆదివారం మేతకు తోలుకెళ్ళారు. ఈ తరుణంలో అకస్మాత్తుగా ఎద్దు రైతును పొడిచింది. తీవ్రంగా గాయపడిన రైతును కుటుంబీకులు చికిత్స నిమిత్తం 108 వాహనం ద్వారా మదనపల్లి జిల్లా ఆసుపత్రికి తరలించారు.

ఎలక్ట్రికల్ శ్మశాన వాటిక ఏర్పాటు చేస్తాం



లక్కిరెడ్డిపల్లె: సేవా కార్యక్రమాలపై సమీక్షిస్తున్న మానవత చైర్మన్, సభ్యులు



రాయచోటి టౌన్: దాతలను సన్మానిస్తున్న మానవత సేవ సంస్థ సభ్యులు

రాయచోటి టౌన్ : రాయచోటి ఎలక్ట్రికల్ శ్మశాన వాటిక ఏర్పాటు చేసేందుకు తమ వంతు కృషి చేస్తామని మాజీ జెడ్పీటీసీ మల్లు నరసారెడ్డి అన్నారు. మానవత నెలవారీ సమావేశంలో భాగంగా ఆదివారం రాయచోటి ప్రతిభా జూనియర్ కళాశాలలో మానవత సేవ సంస్థ అధ్యక్షులు గాండ్లపెంట ఖాదర్ బాషా ఆధ్వర్యంలో సమావేశమయ్యారు. ప్రతిభావంతులైన విద్యార్థులకు నగదు బహుమతిని అందజేశారు. అనంతరం దాతలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు బోనమల ఖాదర్ వలి, శిబ్యాల కెనెరా బ్యాంక్ మేనేజర్ రామనాథరెడ్డి, చర్మవ్యాధి నిపుణులు కరీముల్లా, మానవత సేవ సంస్థ చైర్మన్ అరమాటి శివగంగిరెడ్డి, ఉపాధ్యక్షులు గంగాధర్ నాయుడు, జిల్లా అధ్యక్షులు బ్రహ్మానందరెడ్డి, మాజీ అధ్యక్షులు చింతం వెంకట్రామిరెడ్డి, గుండ్లపల్లె వెంకటేష్, కో– చైర్మన్ షకీల్, గౌరవ సలహాదారుడు వెంకటరమణ, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

దాతృత్వం చాటుకున్న మానవత

సుండుపల్లె : మండల పరిధిలోని బుర్రలదిన్నెపల్లె గ్రామంలో క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న భూమారపు అనసూయకు మానవత సేవాసంస్థ వారు రూ. 15 వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో శివకుమార్, సురేష్ ఆచారి, మహబూబ్ బాషా, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

మానవ సేవే మాధవ సేవ

లక్కిరెడ్డిపల్లె : మానవ సేవ అభివృద్ధి పథంలో నడవాలంటే ముందుగా సభ్యత్వాలు విరివిగా చేయాలని మానవత చైర్మన్ బాల సుబ్రమణ్యం పేర్కొన్నారు. మానవత స్వచ్ఛంద సేవాసంస్థలో ఇప్పటి వరకు 28 సార్లు రక్తదానం చేసిన పకీరయ్యను సన్మానించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి ఆదిమూలం రామచంద్ర, కోశాధికారి, పి.రవిశంకర్, సంయుక్త కార్యదర్శి గంగిరెడ్డి, గోవిందు, నాగరాజు, జిల్లా సభ్యులు ఆరె శివయ్య, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.